

జలవనరులపై నిర్లక్ష్యం వీడండి..

భగీరథమ్మ చెరువుపై కన్నేసిన అక్రమార్కులు

కొనసాగుతున్న నిర్మాణాలు.. నీటి వ్యాపారం

ఫెన్సింగ్ ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం

నిర్మాణాలను తొలగించాలని అడిషనల్ కలెక్టర్ ఆదేశం

గచ్చిబౌలి: భగీరథమ్మ చెరువుకు ముప్పు వాటిల్లుతోంది. ఇరిగేషన్ అధికారుల ఉదాసీనత చెరువు ఉనికే ప్రశ్నార్థకంగా తయారైంది. బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు, ఎఫ్‌టీఎల్‌లో రోడ్డు, నీటి వ్యాపారంతో చెరువు కుంచించుకుపోతోంది. బఫర్ జోన్‌లో కొందరు వ్యక్తులు లేఅవుట్ వేసి ఇరిగేషన్ అధికారులకు సవాల్ విసురుతున్నారు. కొద్ది సంవత్సరాలుగా నిర్మాణాలు వెలవడం, కూల్చివేయడం కొనసాగుతూనే ఉంది. ఇరిగేషన్, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారుల మధ్య సమన్వయలోపం ప్రైవేట్ వ్యక్తులకు వరంగా మారుతోంది. చెరువు రక్షణ కోసం పటిష్టమైన చర్యలు తీసుకోకుంటే నీటి వనరుల ఉనికి ప్రమాదంలో పడే అవకాశం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శేరిలింగంపల్లి మండల పరిధిలోని నానక్‌రాంగూడ సర్వే నంబర్లు 150,151, నార్సింగి మండల పరిధిలోని పుప్పాలగూడ సర్వే నంబర్లు 450, 451లలో 54 ఎకరాలలో భగీరథమ్మ చెరువు విస్తరించి ఉంది.



నానక్‌రాంగూడలోని భగీరథమ్మ చెరువు

మట్టి డంపింగ్

నానక్‌రాంగూడలోని భగీరథమ్మ చెరువు ఎఫ్‌టీఎల్‌లో కొద్దిరోజులుగా మట్టి, బండరాళ్లను డంప్ చేస్తున్నారు. పూడ్చివేస్తున్న ప్రాంతంలో ఓ వ్యక్తి లేఅవుట్ వేసినట్లుగా ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. కాగితాలపై వెలిసిన లే అవుట్‌లో ప్లాట్లను అమ్మేశారు. దీంతో కొందరు వ్యక్తులు తమ పాట్లను కాపాడుకోవాలని ఎల్‌టీఎల్‌లో మట్టి, బండరాళ్లతో పూడ్చుతున్నారు. 2014లో సర్వే చేసి ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించారు. అప్పటికే ఎఫ్‌టీఎల్ ప్రాంతంను పూడ్చివేశారు.దీన్ని బఫర్ జోన్‌గా గుర్తించడంలో అధికారులు ప్రైవేట్ వ్యక్తులతో కుమ్మక్కయ్యారని అప్పట్లో తీవ్ర విమర్శలకు దారితీసింది. ఎఫ్‌టీఎల్ కోసం వేసిన ఫెన్సింగ్‌ను పూర్తిగా తొలగించారు. అంతే కాకుండా బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపట్టారు.

నిర్మాణాల కూల్చివేత

భగీరథమ్మ చెరువు ఎఫ్‌టీఎల్‌లో మట్టి, బండ రాళ్ల డంపింగ్, బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపట్టడంతో అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో కొద్ది రోజుల క్రితం రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ భూపాల్ రెడ్డి భగీరథమ్మ చెరువును సందర్శించారు. ఎఫ్‌టీఎల్‌లో డంపింగ్, బఫర్ నిర్మాణాలు వెలువడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరిగేషన్, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులు ఆగమేఘాల మీద నిర్మాణాలను కూల్చి వేశారు. ఎఫ్‌టీఎల్ లోపలికి వాహనాలు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

ఫెన్సింగ్ వేస్తాం

భగీరథమ్మ చెరువు ఎఫ్‌టీఎల్ ఫెన్సింగ్‌ను వేసేందుకు చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈ విశ్వం తెలిపారు. సీఎస్‌ఆర్‌లో భాగంగా చెరువును అభివృద్ధి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. బఫర్‌లో నిర్మాణాలు, ఎఫ్‌టీఎల్‌లో డంపింగ్ చేస్తే ఊరుకోమన్నారు.

ఎఫ్‌టీఎల్ నిర్ధారించాలి..

భగీరథమ్మ చెరువు ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. చెరువు పూర్తిస్థాయిలో నిండితే బఫర్ జోన్ లోను నీళ్లు ఉండేవని వారు పేర్కొంటున్నారు. బఫర్ జోన్‌లో అక్రమ నీటి వ్యాపారం జోరుగా సాగుతున్నా రెవెన్యూ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఎస్‌టీపీ ప్లాంట్ పేరిట ఎఫ్‌టీఎల్‌లో రోడ్డు నిర్మాణం చేపట్టడం విమర్శలకు తావిస్తోంది. ఎస్‌టీపీ పేరిట వేసిన రోడ్డును ఓ నిర్మాణ సంస్థ తమ అవసరాలకు ఉపయోగించుకోవడం గమనార్హం. సదరు నిర్మాణ సంస్థ ఎఫ్‌టీఎల్ సరిహద్దులను చెరిపి వేసిందనే విమర్శలు ఉన్నాయి. చెరువు బ్యూటిఫికేషన్‌ను అదే నిర్మాణ సంస్థకు ఇవ్వడం ఎంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒక వైపు అక్రమ నిర్మాణాలు, మరో వైపు డంపింగ్, ఇంకో వైపు రోడ్డుతో చెరువుపై ముప్పేట దాడి చేస్తున్నారు.





భగీరథమ్మ చెరువు బఫర్ జోన్‌లో వెలిసిన నిర్మాణాలను కూల్చివేసిన అధికారులు

ప్లాంట్ జెనెటిక్, ఏజీవర్సిటీ మధ్య ఒప్పందం



ఒప్పంద పత్రాలతో ఇరు సంస్థల ప్రతినిధులు

ఏజీవర్సిటీ: భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి పరిధిలోని 'నేషనల్ బ్యూరో ఆఫ్ ప్లాంట్ జెనెటిక్ రిసోర్సెస్', ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మధ్య బుధవారం అవగాహన ఒప్పందం కుదిరింది. పరిశోధన విద్యా కార్యక్రమాలల్లో ఇరు సంస్థలు కలిసి పనిచేయాలని నిర్ణయించగా.. దీనివల్ల పీజీ, పీజెడ్ విద్యార్థులకు పరిశోధనలో ఎంతో ఉపయోగపడనుంది. ప్లాంట్ జెనెటిక్ సంస్థ డైరెక్టర్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్, వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి ఒప్పందంపై సంతకాలు చేసుకున్నారు. విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు డాక్టర్ అనిత, డాక్టర్ జమునారాణి, ఎన్‌బీపీజీఆర్ సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ వి.సలియా చలం, డాక్టర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలి



పరామర్శిస్తున్న మున్సిపల్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: విధులు నిర్వహించే సమయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. యాదవమిత్ర కమాన్ వద్ద విధులు నిర్వహిస్తున్న శానిటరీ జవాన్ నరేందర్ బుధవారం ప్రమాదానికి గురయ్యాడు. దీంతో సమాచారం అందుకున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్ ఆయనను పరామర్శించి పలు జాగ్రత్తలు చెప్పి రూ.5000 సాయం అందజేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు సురేష్, యాదగిరి, జగన్, మల్లేష్, వెంకటేష్ లక్ష్మీనారాయణ, సుభాష్, చక్రి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్లకు నోటీసులు



నోటీసు అందుకుంటున్న చైర్‌పర్సన్ అభ్యర్థి నాగపూర్ణ



వైస్ చైర్మన్ అభ్యర్థి విజయ్‌బాబు

- నార్సింగిలో కొత్త చైర్‌పర్సన్ ఎన్నికకు సిద్ధం
- 31న ప్రత్యేక సమావేశం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 18 మంది కౌన్సిలర్లకు ఈనెల 31న ఉదయం 11 గంటలకు జరిగే చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నిక సమావేశానికి హాజరు కావాలని మున్సిపల్ మేనేజర్ యోగేష్ నోటీసులు జారీ చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం నోటీసులు ఇచ్చారు. నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లపై ఇటీవల అవిశ్వాసం పెట్టి వారిని పదవీచ్యుతులను చేసిన విషయం తెలిసిందే. దీంతో ఖాళీ ఏర్పడిన రెండు పదవులను తిరిగి కౌన్సిలర్లంతా కలిసి కొత్త వారిని ఎన్నుకోవాల్సి ఉంది. ఈ ప్రక్రియలో భాగంగా బుధవారం నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే మెజార్టీ కౌన్సిలర్లు సమావేశం ఏర్పాటు చేసుకుని కొత్త చైర్‌పర్సన్‌గా మంచిరేవులకు చెందిన మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా కోకాపేట్‌కు చెందిన మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరించిన విజయ్‌బాబును ఎన్నుకున్నారు. శుక్రవారం జరిగే ఈ సమావేశంలో వారిని అధికారికంగా ఎన్నుకుని, పదవీ ప్రమాణ స్వీకారం చేయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

లోఓల్టేజీ సమస్యను పరిష్కరించండి

రాయదుర్గం: లోఓల్టేజీ సమస్యతో మూడు రోజులుగా అవస్థలు పడుతున్నామని నానక్‌రాంగూడ లోధ బస్తీవాసులు వాపోతున్నారు. నానక్‌రాంగూడలోని పోచమ్మ దేవాలయం వద్ద ఉండే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి బస్తీకి విద్యుత్ సరఫరా కొనసాగుతోందని మూడు రోజులుగా టీవీలు, ట్యూబ్‌లు వెలగడం లేదని, ఇతర ఎల్రక్టానిక్ వస్తువులు పని చేయడం లేదని వారు వాపోతున్నారు. విద్యుత్ అధికారులు లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



రాయదుర్గం: ఖాజాగూడ పెద్ద చెరువు పరిధిలో నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చివేశారు. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడ పెద్ద చెరువు పరిసరాల్లో ప్రహరీగోడ నిర్మించగా జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్, డిమాలిషన్ విభాగం నోడల్ ఆఫీసర్ స్నేహ శబరీష్ ఆదేశంపై అధికారులు జేసీబీతో ప్రహరీగోడను కూల్చివేశారు. అనుమతిలేని నిర్మాణాలు, ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

నల్లపోచమ్మ ఆలయంలో పూజలు



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

గోల్కొండ: లంగర్‌హౌజ్‌లోని నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల నుంచి మహిళలు ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం ప్రత్యేక పూజలు, కుంకుమార్చన మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో లంగర్‌హౌజ్ మాజీ కార్పొరేటర్ సి.ఉదయ్‌కుమార్, బీజేపీ నాయకుడు ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ కోటకు పర్యాటకుల తాకిడి

గోల్కొండ: గోల్కొండ కోటకు పర్యాటకుల తాకిడి పెరిగింది. పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు కావడంతో కొన్ని రోజులుగా పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తున్నారని కోట అధికారులు పేర్కొంటున్నారు. రద్దీని దృష్టిలో పెట్టుకొని బుకింగ్ కౌంటర్ వద్ద అదనపు సిబ్బందిని నియమించారు. ఎండను సైతం లెక్క చేయకుండా కోటలో కలియతిరుగుతూ అక్కడి చారిత్రక వస్తువులు, ప్రదేశాలను తిలకిస్తున్నారు. కోటలోని ప్రసిద్ధ ప్రాంతాల వద్ద సెల్ఫీలు దిగుతూ సంబురపడుతున్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



దుర్గానగర్ రహదారిపై పగిలిన మ్యాన్‌హోల్

కొత్తవాటిని ఏర్పాటు చేయాలి..



బాక్స్‌డ్రైన్ నిర్మించి ఏడాది కాక ముందే రోడ్డు మధ్యలో ఉన్న డ్రైన్ మ్యాన్ హోల్ పగిలి ప్రమాదకరంగా మారింది. ఏదైనా ప్రమాదం జరగక ముందే జీహెచ్‌ఎంసీ అధికారులు కొత్తవాటిని ఏర్పాటు చేయాలి.

– నర్సింహగౌడ్, స్థానికుడు

మైలార్‌దేవ్‌పల్లి: రహదారులపై మ్యాన్ హోల్స్ ప్రమాదకరంగా మారాయి. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధి దుర్గానగర్ ప్రాంతంలో బాక్స్ డ్రైన్‌పై మ్యాన్ హోల్ పగిలిపోయింది. ఆ వీధిలో రహదారి పొడవున బాక్స్ డ్రైన్ నిర్మించారు. దీనిపైనే వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారు. వాటిపై బీటీ, సీసీ రోడ్డు వేయలేదని, డ్రైన్‌పై స్లాబ్ వేసి వదిలేశారని ప్రజలు వాపోతున్నారు. బాక్స్ డ్రైన్ పనులు పూర్తి కాకుండానే మ్యాన్ హోల్ పగిలిపోయిందని, కాంట్రాక్టర్ నాసిరకం మ్యాన్‌హోళ్లను ఏర్పాటు చేశాడని స్థానికులు మండిపడుతున్నారు. నాణ్యమైన మ్యాన్‌హోల్స్‌ను వేసి ఉంటే పగిలేది కాదని చెబుతున్నారు. మ్యాన్‌హోల్‌లో ఎలాంటి ప్రమాదం జరగక ముందే జీహెచ్‌ఎంసీ అధికారులు గుర్తించి వెంటనే పగిలిన మ్యాన్‌హోళ్లను తీసి కొత్తవాటిని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాలు అందజేత



ఖాజాగూడవాసికి ఎల్‌ఓసీ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడకు చెందిన దివాకర్‌కు అత్యవసర వైద్యచికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2.30 లక్షల ఎల్‌ఓసీ పత్రాలను ఎమ్మెల్యే గాంధీ బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి ఆపదలో ఉన్న వారిని ఆపన్నహస్తంలా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రోజాదేవి రంగారావు, ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, బీఆర్‌ఎస్ నాయకులు గొట్టిముక్కుల పెద్ద భాస్కర్, హరినాథ్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

3 కిలోమీటర్లు..35 నిమిషాలు

నానల్‌నగర్-టోలిచౌకీ రోడ్డుపై ట్రాఫికర్'

గోల్కొండ: మెహిదీపట్నం నుంచి టోలిచౌకీ చౌరస్తా ట్రాఫికర్ నెలకొన్నది. 3 కిలోమీటర్లు కూడా లేని దూరం వెళ్లలంటే కనీసం 35 నిమిషాలు రోడ్డుపైనే గడపాల్సి వస్తుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మెహిదీపట్నం జి.పుల్లారెడ్డి డిగ్రీ కళాశాల నుంచి రేతిబౌలి చౌరస్తా వరకు భారీ వాహనాలు రోడ్డుపై బారులుతీరి ఉంటాయి. రేతిబౌలి చౌరస్తా నుంచి మెహిదీపట్నం వైపు వచ్చే వాహనాలు అత్తాపూర్ వైపు వెళ్తాయి. అదే సమయంలో అత్తాపూర్ నుంచి టోలిచౌకీ, మెహిదీపట్నం నుంచి టోలిచౌకీ వెళ్లే వాహనాలు భారీ సంఖ్యలోనే ఉంటాయి. రేతిబౌలి చౌరస్తా నుంచి నానల్‌నగర్ చౌరస్తా వరకు ప్రయాణం ఓ ఎత్తైతే నానల్‌నగర్ చౌరస్తా నుంచి టోలిచౌకీ చౌరస్తా వరకు ప్రయాణం మరో ఎత్తు. ఈ దారిలో ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బంది ఎక్కడ కనిపించారని వారు మండిపడుతున్నారు. మరో వైపు కొందరు ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకుంటున్న కూడా బల్దియా అధికారులు, ట్రాఫిక్ సిబ్బంది వాటివైపు కన్నెత్తి కూడా చూడడం లేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.



నానల్‌నగర్-టోలిచౌకీ రోడ్డుపై నిలిచిన ట్రాఫిక్

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణమహోత్సవం



వెంకన్న గుట్టపై స్వామివారి కల్యాణం

మైలార్‌దేవ్‌పల్లి: టీఎన్జీవోస్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయ 7వ వార్షికోత్సవంలో భాగంగా గోదా సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం బుధవారం మూడోరోజు వైభవంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు సామిత్రి నారాయణ భక్తులను ఆశీర్వదించారు. భారీ సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు



మజ్లిస్ నాయకులు, స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేయిస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయం వద్ద మజ్లిస్ నాయకులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ అమల్లో ఉండడంతో కొత్త పనులు ప్రారంభం కావడం లేదన్నారు. అనంతరం కార్వాన్ నుంచి వచ్చిన పలువురు ఎమ్మెల్యేను కలిశారు. టోలిచౌకీ చౌరస్తా, ఎండీలైన్స్, తూమ్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో భారీ వరద పైపులైన్ పనులు జరుగుతున్నాయని, వీటి వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయా ప్రాంతాల వారు తన దృష్టికి తెచ్చారన్నారు. వారం క్రితమే ఆయా ప్రాంతాల్లో పర్యటించి పనులు పరిశీలించానని త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించానని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



దామెర: దైవ దర్శనానికి వెళ్తూ.. జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌కు చెందిన కల్లూరి రాణి, తన తల్లి జనరాసుపల్లి లక్ష్మి, బంధువులు చెన్నమ్మ, ఊరడి అనంతమ్మ మంగళవారం రాత్రి సాధుల ప్రభుకు చెందిన ఆటోలో మేడారం బయలుదేరారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున ఊరుగొండ శివారు పెట్రోల్‌బంక్ వద్ద ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో లక్ష్మి(68)కి తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. రాణి, చెన్నమ్మ, అనంతమ్మ, ఆటో డ్రైవర్ ప్రభుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108లో ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ చెన్నమ్మ (78) మృతిచెందింది. క్షతగాత్రురాలు రాణి ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

అబిడ్స్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని గోషామహల్ బీజేపీ కన్వీనర్ సోమరాజ్‌సింగ్ అన్నారు. సీతారామ్‌పేట్‌లో స్థానికుల సౌకర్యార్థం జీహెచ్‌ఎంసీ అధికారులతో బుధవారం ప్యాచ్‌వర్క్ పనులు చేయించారు. ఆయన మాట్లాడుతూ.. రాజాసింగ్, కార్పొరేటర్ లాల్‌సింగ్‌ల సహకారంతో తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాట్లు, ఇతర సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నామన్నారు.

అంధకారంలో బుద్వేల్ ప్రధాన రహదారి



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్ ప్రధాన రహదారి పక్కన విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొత్తవాటిని ఏర్పాటు చేయకపోవడంతో సంబంధిత అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజేంద్రనగర్ వాటర్ వర్క్స్ కార్యాలయం నుంచి శివాంజనేయ స్వామి దేవాలయం వరకు ప్రధాన రహదారిపై వీధి దీపాలు వెలగడం లేదని వాపోతున్నారు. ఈ దారి గుండా రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుకు ఇరువైపుల వ్యాపార కేంద్రాలు కొనసాగుతున్నాయి. ప్రతి బుధవారం వారంతపు సంత నిర్వహిస్తున్నారు. ఈ వారంతపు సంతలో స్థానిక ప్రాంతాలకు చెందిన ప్రజలు తమకు కావాల్సిన కూరగాయలను ఇక్కడే కొనుగోలు చేస్తుంటారు. ప్రతివారం సాయంత్రం 5 గంటల నుంచి 9 గంటల వరకు జరిగే సంత వీధి దీపాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వ్యాపారస్తులు చిన్నపాటి సోలార్ లైట్లను ఏర్పాటు చేసుకుని తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

తెలంగాణ మార్కెట్‌లోకి 'భారతీ సిమెంట్ అల్ట్రాఫాస్ట్'



షేక్‌పేట్‌లోని వైష్ణవి ట్రేడర్స్ డీలర్ షాప్ వద్ద నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న దృశ్యం

గోల్కొండ: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతీ సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ బద్రి తెలిపారు. షేక్‌పేట్‌లోని వైష్ణవి ట్రేడర్స్ డీలర్ షాప్‌లో తాపీ మేస్త్రీల సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతీ అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా పూర్తవుతుందన్నారు. అల్ట్రాఫాస్ట్‌తో ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపికని పేర్కొన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతీ సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడుతారని పేర్కొన్నారు. ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతీ అల్ట్రాఫాస్ట్ రూ. 20 అధికంగా ఉంటుందని తెలిపారు. డీలర్ కె.దయానంద్ మాట్లాడుతూ భారతీ సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ మార్కెటింగ్ రామకృష్ణ, టెక్నికల్ ఆఫీసర్ సాహేర్, సామ్రాట్, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.